క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న సభ్యులు

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామ రామాలయం హుండీ ఆదాయం శనివారం లెక్కించగా రూ.24163 సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్ర తి ష్ఠాపన నేపథ్యంలో భక్తులు కానుకలు సైతం సమర్పించారని పేర్కొన్నారు. లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

భైంసాటౌన్: నిజామాబాద్‌లో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించే బహుజన లెఫ్ట్ రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు సయ్యద్ మహమూద్ కోరారు. శనివారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. కార్మికులు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చాట్ల పోసవ్వ, కళ, వనమాల, శాంతకుమారి ఉన్నారు.

క్రీడా మైదానం పరిశీలన

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే సీఎంకప్ క్రికెట్ పోటీల కోసం ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ డీఈ హరిభువన్, పీడీ భూమన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవదాస్ ఉన్నారు.

'తెలంగాణ తల్లిగా చాకలి ఐలమ్మను గుర్తించాలి'

భైంసాటౌన్: వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్నే తెలంగాణ తల్లి విగ్రహంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌తోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టానుసారం తెలంగాణతల్లి విగ్రహాలు ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే భూమి, భుక్తి, పేదప్రజల విముక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా గుర్తించాలని కోరారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

బాసర: తమ సామాజిక వర్గాన్ని దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని పద్మనాయక (వెలమ)సంక్షేమ సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాసర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గణేశ్, భైంసాలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కొండూరి ప్రతాప్‌రావు, మనోహర్ రావు ఉన్నారు.

ఓటరు జాబితా విడుదల

ముధోల్: మండలంలోని 19 గ్రామపంచాయతీలకు సంబంధించిన 166 పోలింగ్‌బూత్‌ల ఓటరు జాబితాను శనివారం ఎంపీడీవో శివకుమార్.. తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈనెల 25వరకు మార్పులు, చేర్పులుంటే పంచాయతీ కార్యదర్శుల వద్దకు వెళ్లి సరిచూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో శిరీష, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

దిలావర్‌పూర్: బాలశక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మండలకేంద్రంలోని కేజీబీవీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు ప్రియాంక, శ్రీవిద్య, రమేశ్, అలీ వివరించారు. ఆరోగ్య స్థితిగతులు పరిశీలించి ప్రతి విద్యార్థినికి హెల్త్‌కార్డు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అపర్ణ, నిర్మల్, దిలావర్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రుల ల్యాబ్ టెక్నీషియన్లు ప్రవీణ్, వెంకటస్వామి, రాధ, ఏఎన్‌ఎంలు స్రవంతి, అనిత, ఆశవర్కర్లు శోభ, విజయ, గంగామణి, ఎస్‌ఆర్పీలు తదితరులున్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, వసతిగృహంలో విద్యార్థులకు కుంటాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, హెచ్‌ఏ ఎన్వీఎన్ ప్రసాద్, ఆశవర్కర్ మమత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన ఎగ్గం భోజన్న తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకొని కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హాదీ, మాజీ చైర్మన్ రాజ్‌మహ్మద్, నాయకులు, తదితరులు ఉన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- ఆశాజనకంగా యాసంగి సాగు
- సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని రైతుల వేడుకోలు



తానూరులో మొక్కజొన్న పంట



బోరిగాం శివారులో సాగు చేసిన శనగ పంట

తానూరు: జిల్లాలో ఈసారి అధికంగా వర్షాలు కురిసినా ఖరీఫ్‌లో ఆశించినంత దిగుబడులు రాలేదు. సోయా, పత్తిపంటలు దెబ్బతిని దిగుబడులు సగానికి పడిపోయాయి. దీంతో కొందరు రైతులకు పెట్టుబడులు కూడా రాలేదు. దీంతో అప్పులు చేసి మళ్లీ యాసంగి సాగుపై దృష్టి సారించారు.

ఇప్పటికే 1.80 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఇప్పటివరకు 1.80 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. 60వేల ఎకరాల్లో శనగ, 1.10 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 10వేల ఎకరాల్లో పెద్దజొన్న, కుసుమ, గోధుమ పంటలు సాగుచేశారు. గత యాసంగి కంటే ఈసారి అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు.

అవగాహన కల్పించాలంటున్న రైతులు..

వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి.. సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తే దిగుబడులు మరింత పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేవారు లేక దిగుబడులు నష్టపోతున్నట్లు వివరించారు. కొన్ని మండలాలకు వ్యవసాయాధికారులు లేకపోవడంతో ఇబ్బంది అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటాల మండలంలోని సూర్యాపూర్ క్లస్టర్‌లో ఏఈవో పోస్టు, బాసర మండలంలోని ఇద్రెల్లి క్లస్టర్‌కు ఏఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని క్లస్టర్లలో ఏఈవోలు ఉన్నా.. అవగాహన కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వ్యవసాయశాఖలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించి యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

ఆశాజనకంగా పంటలు



ఈసారి అధిక వర్షాల కారణంగా భూమిలో తేమ ఎక్కువ ఉంది. దీంతో ఇప్పటికే వేసుకున్న శనగ, పెద్దజొన్న పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తే మరిన్ని దిగుడులు సాధిస్తాం.

– చిన్నబాబు, బోరిగాం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తాం

రైతులు యాసంగిలో సాగు చేసిన శనగ, మొక్కజొన్న, పెద్దజొన్న, కుసుమ, కూరగాయల పంటలను ఏఈవోలు పరిశీలించి జాగ్రత్తలను రైతులకు వివరించేలా చర్యలు తీసుకుంటాం. ఖాళీగా ఉన్న ఏఈవో పోస్టులను భర్తీ చేస్తాం.

– వినయ్‌బాబు, ముధోల్ ఏడీఏ

జీతం పెంపుపై హోంగార్డుల హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న హోంగార్డులు

నిర్మల్‌చైన్‌గేట్: హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డుల సేవలను గుర్తించి రోజువారి జీతం, ఇతర అలవెన్స్ పెంచడంపై జిల్లా హోంగార్డ్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈసందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ దేశంలోనే తెలంగాణ పోలీస్‌శాఖకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, సిబ్బంది అలీం, సురేందర్, నారాయణ, నరేందర్ పాల్గొన్నారు.

9న సంబరాలకు తరలిరావాలి

భైంసాటౌన్: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 9న పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించే సంబరాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ పుట్టినరోజు, ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిన రోజు, తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ రోజు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రోజు కావడంతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

9 నుంచి నీటి సరఫరా బంద్

దిలావర్‌పూర్/నర్సాపూర్(జి): దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లోని గ్రామాల్లో ఈనెల 9వ తేదీ నుంచి 11వరకు మూడు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. మాడేగాం గ్రామంలోని వాటర్ ట్రీట్ ప్లాంట్ వద్ద చేపట్టే మరమ్మతుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. గురువారం నుంచి యథావిధిగా నీటి సరఫరా కొనసాగుతుందని ఏఈ తెలిపారు.

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: మిషన్ భగీరథ మాడేగాం నీటి శుద్ధీకరణ కేంద్రం, పైపులైన్ నిర్వహణలో భాగంగా ఈనెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఖామర్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు.

9న నిర్మల్‌కు గోరక్ష పాదయాత్ర

నిర్మల్‌చైన్‌గేట్: కశ్మీరు నుంచి దాదాపు 14 రాష్ట్రాల మీదుగా కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన గోరక్ష మహాపాదయాత్ర సోమవారం నిర్మల్ చేరుకుంటుందని అయ్యప్ప సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి విగ్నేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి మహా పాదయాత్ర ప్రారంభమై పట్టణ పురవీధుల గుండా కొనసాగుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం పట్టణంలోని జీకే ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలకు హాజరై మాట్లాడారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలు పరిశీలించి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో విజయోత్సవాల ప్రోగ్రాం ఇన్‌చార్జి ఈరవత్రి అనిల్, జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, మండలాధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, వైస్ చైర్మన్ కావలి సంతోశ్, పీఏసీఎస్ చైర్మెన్లు అమంద శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శంకర్, సురేశ్, నయిం, స్వప్నిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఎమ్మెల్యేను కలిసిన శాలివాహన సంఘం

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు.. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవించారు. పట్టణంలో సంఘ భవనం, గోదావరి వద్ద తాతమ్మ గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. శాలి వాహన చక్రవర్తి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని విన్నవించారు. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్, ఎల్లయ్య, రాజు, రాజేశ్వర్, సురేశ్, రమేశ్, రాజన్న తదితరులున్నారు.

'ఏడాది పాలనలో కాంగ్రెస్ విఫలం'

నిర్మల్‌చైన్‌గేట్: ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు 66 మోసాలపై శనివారం జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీజేపీ బహిరంగ సభ నిర్వహించింది. జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా నిరసన కార్యక్రమాల ఇన్‌చార్జి రావుల రాంనాథ్ మాట్లాడారు. రైతులకు పూర్తి రుణమాఫీ జరగలేదని, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, సత్యనారాయణగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, అలివేలు మంగ, రాచకొండ సాగర్, అర్జున్, కౌన్సిలర్లు నరేందర్, శంకర్ పతి, పద్మాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్

దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం



సారంగపూర్ : పారాయణం చేస్తున్న మహిళలు

సారంగపూర్: మండలంలోని ప్యారమూర్ దత్తాశ్రమంలో దత్త జయంతి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు గోపూజోత్సవం, గణపతిపూజ, పుణ్యాహవచనం, గురు దత్తాత్రేయ పారాయణం చేపట్టారు. ఏడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని దత్తాశ్రమ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కుంటాల:మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ విఘ్నేశ్వరపూజ, శ్రీ దత్త వెంకట సాయి దేవతల పూర్ణాభిషేకం, కలశస్థాపన, శ్రీ గురుచరిత్ర, శ్రీ దత్త పురాణం, శ్రీ సాయిబాబా సత్ చరిత్ర, శ్రీగజానన్ విజయం, శ్రీ వల్లభ చరితామృతం, పారాయణం కార్యక్రమాలు చేపట్టారు.

మేడం..ఫొటో ప్లీజ్



విద్యార్థులతో ఫొటో దిగుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌ఖిల్లా: విధుల్లో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారిలో స్ఫూర్తిని నింపారు. జిల్లాకేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ మేళాను కలెక్టర్ సందర్శించారు. ప్రయోగాలను తిలకించి మరో కార్యక్రమానికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా మామడ మండలం పరిమండల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కలెక్టర్ వద్దకు వెళ్లి 'మేడం ఒక్క ఫొటో ప్లీజ్' అని అడిగారు. దీంతో కారు దిగి వచ్చి.. చిన్నారులతో ఫొటో దిగారు. చదువొక్కటే మనల్ని ఉన్నత స్థానాలకు చేరుస్తుందని.. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం

లోకేశ్వరం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శనివారం మండలవ్యాప్తంగా పోటీలు ప్రారంభమయ్యాయి. లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో పోటీలను ఎంపీడీవో వెంకటరమేశ్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఎంపీఈవో సోలమాన్‌రాజ్, హెచ్‌ఎంలు ఉన్నారు.

తానూరు: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో సీఎంకప్ క్రీడా పోటీలను హెచ్ఎం సాయిబాబు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలాలో సీఎం కప్ పోటీలను ఎంపీడీవో లింబాద్రి ప్రారంభించారు. ఎంపీవో ఎంఏ రహీంఖాన్, హెచ్‌ఎం శ్రావణ్‌కుమార్, కార్యదర్శి యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎంకప్ పోటీలను ప్రారంభించారు. బాలబాలికలకు ఖోఖో పోటీలు నిర్వహించినట్లు పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందులో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భూమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక తదితరులున్నారు.



లోకేశ్వరంలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో వెంకటరమేశ్

నర్సాపూర్ (జి): మండలకేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో గ్రామస్థాయి సీఎం కప్ పోటీలను ఎస్సై హన్మాండ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని కబడ్డీ, ఖోఖో పోటీల్లో రాణించాలని సూచించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం పురుషోత్తం, కార్యదర్శి రాథోడ్ కైలాస్, పీడీ దేవేందర్, ఉపాధ్యాయులు భూమేశ్వర్ ఉన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్, పాక్‌పట్ల ఉన్నత పాఠశాలల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకన్న ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సుమయ్యాద్ తస్కిన్, నాగ చంద్రభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



నర్సాపూర్(జి)లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై హన్మాండ్లు



కడెం: లింగాపూర్‌లో ప్రారంభిస్తున్న అధికారులు

'ఉచిత ప్రయాణం రద్దు చేయాలి'

లక్ష్మణచాంద: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం రద్దు చేయాలని కోరుతూ శనివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో లక్ష్మణచాందలో ధర్నా చేపట్టారు. ఉచిత ప్రయాణంతో ఆటోలకు కిస్తీలు కట్టలేని దుస్థితి నెలకొందని ఆటో యూనియన్ సభ్యులు తెలిపారు.

ఆటో, క్యాబ్‌డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆటో, క్యాబ్‌డ్రైవర్ల అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆటో, ట్యాక్సీ, వ్యాన్, క్యాబ్‌ల రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఖానాపూర్‌లో నిరసన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన డ్రైవర్లు, యజమానులకు ప్రతి నెలా భృతి చెల్లించాలన్నారు. ఆటో, రవాణా రంగ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలన్నారు. 2019 మోటారు వాహనాల చట్టం రద్దు చేసి.. ప్రైవేటు ఫైనాన్సియర్ల దోపిడీని అరికట్టాలని పేర్కొన్నారు. డ్రైవర్లు జావిద్, రాయబోస్, వెంకటరాములు, మజీద్, జమీర్, గంగారాం, రంజిత్, రవీందర్, కృష్ణ, తదితరులున్నారు.



లక్ష్మణచాందలో ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

కడెం: మహాలక్ష్మీ పథకం (ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం) రద్దు చేయాలని ఆటో, టాటామ్యాజిక్ డ్రైవర్లు శనివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణంతో ప్రైవేటు ఫైనాన్స్ చెల్లించలేకపోతున్నామని .. కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



కడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

లోకేశ్వరం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం రద్దు చేసి.. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు పోల్కం లక్ష్మణ్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో లోకేశ్వరంలో ఆటోలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లు సైదులు, మల్లేశ్, భోజన్న, నర్సారెడ్డి, వెంకటేశ్ తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సారంగపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో శనివారం ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో రైతులు, మహిళలు, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిశేకం చేశారు. అనంతరం చైర్మన్‌ను స్థానిక నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో తేజునాయక్, రాజ్‌కుమార్, మధుకర్, సూర్యం, సురేందర్, నర్సయ్య, గంగన్న, కరుణాకర్‌రావు, దయానంద్, భీమేశ్ తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని పాక్‌పట్ల, న్యూవెల్మల్ గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, మాజీ ఎంపీటీసీ మేక నరేశ్, గ్రామ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, సీహెచ్ గంగాధర్, పోశెట్టి, మల్లయ్య, సాయన్న, మల్లేశ్ ఇరు గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిర్పెల్లిలో..

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లిలో రైతు పండుగ నిర్వహించారు. సీఎం చిత్రపటానికి ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ క్షీరాభిషేకం చేశారు.



సారంగాపూర్ : తాండ్ర(జి)లో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సొన్న భీమేశ్, నాయకులు కొండ్ర అశోక్, సల్దే సుభాశ్, సాల్దే రాజేశ్వర్, బద్దర్ నవీన్, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఓపెన్‌హౌస్

నిర్మల్‌రూరల్: నిర్మల్‌లోని సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు రివాల్వర్, రైఫిల్ 303, సెల్ఫ్ లోడ్ రైఫిల్, ఏకే47 మిషన్, మిషన్ గన్‌లను ప్రదర్శించి వాటి పనితీరు విద్యార్థులకు వివరించారు. మెటల్ డిటెక్టర్ టీం, బాంబు నిర్వీర్య టీంలు ఆయా పరికరాల పనితీరు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, పట్టణ సీఐ ప్రవీణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆయుధాల పని తీరు వివరిస్తున్న పోలీసులు